క్లుప్తంగా

గ్రీవెన్స్ బాక్స్.. బట్ నాట్ యూజ్



డీపీటీఓ కార్యాలయం వద్ద గోడకు ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ బాక్స్

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ బాక్స్ అలంకారప్రాయంగా మారింది. డీపీటీఓ కార్యాలయం ముందు భాగంలో గోడకు ఏర్పాటు చేసిన ఈ బాక్స్‌కు కనీసం తాళం లేదు. బాక్స్‌ను అలా నామమాత్రంగా ఉంచేశారు. దీంతో ఆర్టీసీకి సంబంధించి అనేక సమస్యలు ఉన్నా.. తాము ఇచ్చే ఫిర్యాదులకు భద్రత లేకపోవడంతో గడిచిన ఆరునెలల్లో ఒక్కటంటే ఒక్క అర్జీని కూడా గ్రీవెన్స్ బాక్స్‌లో వేయలేదని పలువురు ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. ఆర్టీసీలోని ఏ అధికారి కూడా గ్రీవెన్స్ బాక్స్ గురించి పట్టించుకున్న పాపానపోలేదని పలువురు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

రోటరీ క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రోటరీ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో చెన్నై, బెంగళూరు జాతీయ రహదారి సమీపంలో సుబ్బయ్య కాలనీ వద్ద నూతనంగా నిర్మించనున్న రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. భవన నిర్మాణం కోసం సుదర్శనం రాజు, మట్టా పురుషోత్తంరెడ్డి విరాళంగా ఇచ్చిన సుమారు రూ.2 కోట్ల విలువైన భూమిలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో సమాజానికి బహుళ ప్రయోజనార్థం ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా విరాళ దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పురుషోత్తమ పటేల్, కార్యదర్శి వేమూరి జయరామ్ ప్రసాద్, కోశాధికారి మాఘం హేమచందర్, ఉపాధ్యక్షులు బాలాజీ చౌదరి, టెంకాయల దామోదరం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోము రవికుమార్, కార్యదర్శి రాజేష్‌కుమార్, రాధికారాణి, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సనత్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, అదేవిధంగా అర్జీలు, ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజల కోసం ఉదయం 10:30 నుంచి ×ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక× కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877–2227208 నంబరుకు కాల్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు.

బంగారు తిరుచ్చిపై సుందరరాజస్వామి



తిరుచ్చిపై దేవేరులతో కలసి ఊరేగుతున్న శ్రీసుందరరాజ స్వామివారు

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీ సుందరరాజ స్వామివారు ఆదివారం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామివారి ఉత్సవర్లకు అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీసుందరరాజ స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం విశేష అలంకరణలో విరాజిల్లుతున్న స్వామివారు ఉభయదేవేరులతో కలసి నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు అభయమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ దేవరాజులు, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బారాయుడు, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి నిత్యం వేలాదిమంది భక్తుల రాకపోకలు ఉంటాయనే విషయం తెలిసిందే. అందులో ప్రధానంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆధారంగా తిరుపతి–తిరుమల దేవస్థానాలతో పాటు జిల్లాలోని పలు ఆలయాల సందర్శనకు భక్తులు ఆర్టీసీలో ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం తిరుపతి బస్టాండ్‌లో కనీసం తాగునీటి సదుపాయం కల్పించడం లేదని గట్టిగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

తిరుపతి బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్న తిరుపతి బస్టాండ్



గుక్కెడు నీటికి దిక్కులేదు

- తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో తాగునీటికి అవస్థలు
- పెరుగుతున్న ప్రయాణికులు
- 4 బస్టాండ్లకు కలిపి మూడే కొళాయిలు
- పల్లెవెలుగు బస్టాండ్‌లో తాగునీటి జాడ లేదు
- మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లు
- వాటర్ బాటిళ్ల ధరలు అమాంతం పెంచేసిన దుకాణాదారులు
- 4 బోర్లు ఉండగా అందులో రెండు మరమ్మతులు
- ఏడాదికి రూ.21 లక్షలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు



శ్రీహరి బస్టాండ్‌లో విరిగిపోయిన తాగునీటి కొళాయి



శ్రీనివాస బస్టాండ్‌లో కొళాయి విరిగిపోయిన దృశ్యం



ఏడుకొండల బస్టాండ్‌లోని తాగునీటి కొళాయి

ఆర్టీసీ జిల్లా సమాచారం

డిపోల సంఖ్య	–	11
బస్సుల సంఖ్య	–	743
విద్యుత్ బస్సులు	–	100
జిల్లాలో రోజువారి ప్రయాణికులు	–	5.25 లక్షలు
రోజు వారి రాబడి	–	రూ.1.70 కోట్లకు పైగా
జిల్లాలో ఉద్యోగుల సంఖ్య	–	4255 మంది
ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్	–	01
జిల్లాలోని బస్టాండ్లలో దుకాణాలు	–	476
దుకాణాల ద్వారా ఏడాది రాబడి	–	రూ.42 కోట్లు
ఏడాదిలో కార్గో రాబడి	–	రూ.5 కోట్లు

తిరుపతి అర్బన్: వేసవికాలం వచ్చేసింది.. అయితే తిరుపతి బస్టాండ్‌లో తాగునీటి చర్యలు ఏమాత్రం చేపట్టలేదని పలువురు మండిపడుతున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేర్లతో నాలుగు బస్టాండ్లు నడుస్తున్నాయి. అయితే శ్రీహరి బస్టాండ్‌లో ఒక్కటి, శ్రీనివాసంలో ఒక్కటి ఏడుకొండల బస్టాండ్‌లో ఒక్క కొళాయి మాత్రమే ఉన్నాయి. పల్లెవెలుగు బస్టాండ్‌లో ఒక్కటంటే ఒక్క కొళాయి లేదు. ఉన్న కొళాయిలు మూతలు విరిగి.. నామమాత్రంగానే తాగునీరు వస్తుంది. టీటీడీ వారు మూడు ఆర్వో ప్లాంట్లను, వర్తకసంఘం వాకు ఒక ఆర్వో ప్లాంట్‌ను విరాళంగా బస్టాండ్‌కు ఇచ్చారు. అన్ని మరమ్మతులకు గురయ్యాయి. ఒక్కటి కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులకు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు బోర్లు ఉన్నాయి. అందులో రెండు మరమ్మతులకు గురయ్యాయి. మరో రెండు నామమాత్రంగా పని చేస్తున్నాయి. కార్పొరేషన్ నీరు వాడుకునే సౌకర్యం ఉన్నా.. బస్టాండ్‌కు వినియోగించడం లేదు. ఏడాదికి రూ.21 లక్షలు చెల్లించి ట్యాంకుల ద్వారా కమీషన్ కోసం తాగునీటిని కొనుగోలు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో ఉన్న ఆర్వో ప్లాంట్ సైతం మరమ్మతులకు గురైంది.

ప్రయాణికుల రద్దీ..

సాధారణ సమయంలోనే తిరుపతి బస్టాండ్ రద్దీగా ఉంటుంది. ఇక వేసవిలో చెప్పాల్సిన పనిలేదు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని నాలుగు బస్టాండ్లలో 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. మరో 80 దుకాణాలు నడుస్తున్నాయి. రోజుకు 3 వేల నుంచి 3500 ట్రిప్పులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ముఖ్యమైన అన్ని ప్రాంతాలకు చెందిన అనేక సర్వీసులు నడుస్తున్నాయి. రోజుకు 1.25 నుంచి 1.30 లక్షల మంది ప్రయాణికులు తిరుపతి మీదుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇక వేసవి కాలం నేపథ్యంలో ఈ నెల నుంచి 1.50 లక్షల మంది ప్రయాణికులు జర్నీ చేస్తారని అధికారులు అంచనాలు వేస్తున్నారు. సరైన తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో బస్టాండ్‌లో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేయాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ఇదే అదునుగా పలువురు లీటర్ వాటర్ బాటిల్‌ను రూ.25 నుంచి రూ.26కి విక్రయిస్తున్నారు.



లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న ట్యాంకర్ల నీరు



నిరుపయోగంగా డీపీటీఓ కార్యాలయంలోని తాగునీటి కొళాయిలు

తాగునీటిపై దృష్టి పెట్టాలి..



తిరుపతికి ఉన్న ప్రత్యేకత అందరికీ తెలిసిందే. దానికితోడు వేసవికాలం వచ్చిందంటే తాగునీటి వినియోగం తెలిసిందే. ఈ క్రమంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉన్న కొళాయిలతో పాటు అదనపు కొళాయిలు ఏర్పాటు చేయాలి. మరమ్మతులకు గురైన కొళాయిలను, ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలి. లేదంటే దుకాణాల్లో అధిక ధరలు చెల్లించి అందరూ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేయలేరనే విషయాన్ని ఆర్టీసీ అధికారులు గుర్తించాలి.

– రాజు, ప్రయాణికుడు, తిరుపతి

ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నాం



ట్యాంకర్ల ద్వారా తిరుపతి బస్టాండ్‌లోని అవసరాల నిమిత్తం నీటిని పెద్ద మొత్తానికే కొనుగోలు చేస్తున్నాం. కొళాయిలను బాగు చేయిస్తాం. అవసరం అయితే అదనపు కొళాయిలను ఏర్పాటు చేయిస్తాం. దుకాణదారులు అదనపు రేట్లకు వాటర్‌బాటిళ్లను విక్రయించకుండా చర్యలు తీసుకుంటాం. కార్పొరేట్ వారు అందించే నీటిని వినియోగించుకునే ప్రయత్నం చేస్తాం. అన్ని బోర్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– డీఆర్ నాయుడు, ఏటీఎం, తిరుపతి బస్టాండ్

ఈడీ ఆదేశాలు ఉన్నాయి



ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి వేసవి నేపథ్యంలో జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల్లో తాగునీటి సమస్యలు లేకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా జిల్లావ్యాప్తంగా అన్ని డిపోల్లోనూ తాగునీటిపై ప్రత్యేక ఫోకస్‌పెట్టాం. డీపీటీఓ కార్యాలయంలోని ఆర్వో ప్లాంట్లతో పాటు అన్నింటినీ బాగు చేయించి అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రయాణికులకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– నరసింహులు, జిల్లా ప్రజా రవాణా అధికారి

శుభాకాంక్షలు.. పరామర్శలు



నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెబుతున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



మునస్వామిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : ఉమ్మడి చిత్తూరు వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించారు. మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ మల్లెలచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఇంట జరిగిన పెళ్లి రిసెప్షన్ వేడుకల్లో మోహిత్‌రెడ్డి పాల్గొని వరుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వధువు హిమబిందులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు.

మునస్వామిరెడ్డికి నివాళులు..

మండలంలోని చెన్నుగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌రెడ్డి తండ్రి మునస్వామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన కర్మక్రియల సందర్భంగా భాగంగా హర్షిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మునస్వామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, డివిజన్ అధ్యక్షులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీ సురేష్, మునిరత్నంరెడ్డి, బాబురెడ్డి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గట్టి నిఘా.. ఇబ్బంది ఉండదుగా..!

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిధిలో నిత్యం చోరీల సంగతి తెలిసిందే. బస్టాండ్ నుంచి అయితే గంజాయి సైతం అక్రమ రవాణా సాగుతుంది. మరోవైపు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. ఈ క్రమంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆయన పరిధిలోని స్పెషల్ టీంకి చెందిన ఆరుగురు పోలీసులను తిరుపతి బస్టాండ్‌కు, ఐదుగురిని తిరుపతి రైల్వేస్టేషన్‌కు కేటాయించారు. ఆ మేరకు వారు నిత్యం నిఘా పెడుతున్నారు. అనుమానంగా సంచరిస్తున్న వారిని సైతం విచారిస్తున్నారు.



ప్రయాణికులను తనిఖీ చేస్తున్న స్పెషల్ టీం

● వాళ్లు స్పందించరు.. వీళ్లు విరమించరు..

గౌరవవేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో గత 28 రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మె చేస్తున్న వెటర్నరీ జూడాల పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారులు, ప్రభుత్వం సమస్యపై స్పందించకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తోంది. దీంతో తమ డిమాండ్‌ను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని జూడాలు హెచ్చరిస్తున్నారు. ఎన్నాళ్లిలా విద్యార్థుల సమస్యను పట్టించుకోకుండా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తారనే అంశంపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రోజురోజుకు వెటర్నరీ జూడాల సమ్మెకు రైతు సంఘాలు, జిల్లాలోని పలు విద్యార్థి సంఘాలు మద్దతు పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేసి సమ్మె విరమించాలని వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు కోరుకుంటున్నారు – తిరుపతి సిటీ



ఘనంగా ఏపీ హంస మహిళా క్రీడాపోటీలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి తుడా: ఏపీ హంస సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించు ముందస్తు క్రీడలు స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా, స్థానిక నేత మబ్బు దేవనారాయణరెడ్డి హాజరై జెండా ఊపి మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని నర్సింగ్ సిబ్బంది దేవతలతో సమానమని కొనియాడారు. వైద్య శాఖలోని మహిళా ఉద్యోగులు నిరంతరం విరామం లేకుండా పని ఒత్తిడిలో మునిగి ఉంటారని, అలాంటి మహిళా వైద్య ఉద్యోగులకు క్రీడలు ఎంతో మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. ఉమెన్స్ డే కమిటీ సభ్యులు చైర్మన్ టాటాబాయ్, వైస్ చైర్మన్ రోహిణి, కమిటీ సభ్యులు, ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా ట్రెజరర్ ఇమ్రాన్, ఉపాధ్యక్షులు గీత, సహాయ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

● 30 మీటర్ల దూరం.. 36 గుంతలు.. !





ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో రోడ్లు దారుణంగా ఉన్నాయి. వెటర్నరీ కళాశాల నుంచి మహిళా హాస్టళ్లకు వెళ్లే రోడ్డు మార్గం 30 నుంచి 45 మీటర్ల పొడవు మాత్రమే ఉంటుంది. అయితే ఆ తారురోడ్డులో అడుగడుగునా గుంతలే. ఆదరమరచి నడిస్తే ఆస్పత్రి పాలు కాక తప్పదు. బోర్లపడి మోకాళ్లు పగలాల్సిందే. ఇలా ఎంతోమంది విద్యార్థినులు జారిపడిన సంఘటనలు కోకొల్లలు. ఇక వర్షం పడితే ఆ దారిలో వెళ్లేందుకు విద్యార్థినులు భయపడుతుంటారు. మసకపడితే చాలు రోడ్డులో ప్రయాణం చేయడం సాహసం చేయాలి. రోడ్డు మరమ్మతులు చేశాం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వ పాలకులకు వెటర్నరీ మహిళా జూడాల వసతి గృహాలకు వెళ్లే దారి కనబడడం లేదా.. ! అంత నిర్లక్ష్యమా విద్యార్థినులంటే..! అంటూ ఉద్యోగులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీసీ బంగ్లాకు సైతం ఇదేదారిలో వెళ్లాల్సిరావడం గమనార్హం..

– తిరుపతి సిటీ